# బామ్మగారు-భలే మనవడు

అబ్బరాజు జయలక్ష్మి

పెళ్ళిచూపులకు ఉత్సాహంగా వచ్చిన లోకేష్ అమ్మాయిని చూడగానే ఖంగుతిన్నాడు. ఆ అమ్మాయి వేషభాషలు చూసి బెంబేలెత్తాడు.

అసలు అప్పుడే పెళ్ళే వద్దన్నాడు లోకేష్. "పెళ్ళి చేసుకోకుండా ఇంకా ఎన్నాళ్ళలా ముదురు బెండకాయలా ఉంటావురా!" అన్నది వాళ్ళ బామ్మ. మనవడికి ఇంకా ఇరవై ఆరేళ్ళే అయినా, అలా అంటే అయినా పెళ్ళికి ఒప్పుకుంటాడేమోనని. త్వరగా మనవడి పెళ్ళి చూడాలని ఆవిడ తాపత్రయం.

"తొందరగా నీ పెళ్ళయితే నాకు కాస్త సాయంగా కోడలు పిల్ల వస్తుంది" అన్నది వాళ్ళ అమ్మ అనసూయ.

"నీ ఈడుకి నేను తండ్రిని కూడా అయ్యాను. కాబట్టే నేను రిటైరయ్యేటప్పటికి నువ్వు సంపాదన పరుడవయ్యావు. అందుకని నువ్వు కూడా త్వరగా పెళ్ళి చేసుకోవాలి" అంటూ లాజిక్ మాట్లాడాడు వాళ్ళ నాన్న జగన్నాథం.

పెళ్ళికి 'సరే' అనక తప్పలేదు లోకేష్‌కి.

అప్పటి నుంచి లోకేష్‌కు తగిన అమ్మాయి కోసం గాలింపు మొదలుపెట్టారు పెద్దవాళ్ళు ముగ్గురూ.

మ్యారేజి బ్యూరోల ద్వారా అమ్మా, నాన్న ప్రయత్నిస్తుంటే బంధుమిత్రుల చిట్టాలన్నీ తిరిగేయడంలో బామ్మగారు యమ బిజీ అయిపోయారు. అలా తగిలిన వాటిలో రెండు, మూడు సంబంధాలు బాగున్నాయని పించి పెళ్ళిచూపులకు వెళ్ళటం లోకేష్ పిల్ల నచ్చలేదనటం జరిగిపోయాయి.

లోకేష్ మళ్ళీ ఓ పేచీ పెట్టాడు.

"పెళ్ళిచూపులు వద్దు" అన్నాడు.

"పెళ్ళిచూపులు లేకపోతే ఎలా? అమ్మాయి, నువ్వు ఒకరినొకరు చూసుకుని ఇష్టపడితేనే కదా పెళ్ళిదాకా వచ్చేది?" అన్నది వాళ్ళ అమ్మ ఆదుర్దాగా.

"ఏం? ఎందుకు చేసుకోకూడదు? లవ్ మ్యారేజి చేసుకుంటాడేమో నా మనవడు! ఏ అమ్మాయినయినా లవ్ చేశావా ఏమిట్రా లోకేశూ!" అన్నది వాళ్ళ బామ్మ.

"ఆ! అదొకటే తక్కువ వీడికి!" అన్నాడు వాళ్ళ నాన్న వెంటనే.

"అబ్బ! అదేం కాదుగానీ నేను చెప్పేది కాస్త వినండి! కొన్ని కండిషన్స్ మీదయితే నేను పెళ్ళికి ఒప్పుకుంటాను. లేకపోతే ఇప్పట్లో నా పెళ్ళి మాటెత్తకండి!" అన్నాడు.

"ఏమిటవీ!" అన్నారు ముగ్గురూ ముక్తకంఠంతో మళ్ళీ ఏం తిరకాసు ఉంటుందోనని!

"పెళ్ళిచూపులు ఇంట్లో కాకుండా వెరైటీగా ఏ హోటల్‌లోనో, పార్క్‌లోనో ఏర్పాటు చేయాలి!"

"అందుకు అవతలవాళ్ళు ఒప్పుకోవద్దూ!" అని దీర్ఘం తీసింది అనసూయ.

"మనం ఒప్పిస్తే సరి!" అని వెంటనే అన్నది బామ్మగారు.

'కొన్ని విషయాలలో అమ్మకంటే బామ్మే నయం' అని అనుకుంటూ ఉంటాడు లోకేష్. బామ్మ ఈ కాలానికి తగినట్లుగా ఆలోచిస్తూ అడ్జస్ట్ అవుతూ ఉంటే అమ్మ మాత్రం బామ్మ కాలానికి తగ్గట్లుగా మాట్లాడుతూ ఉంటుంది. ముఖ్యంగా బామ్మ తనకు ఎప్పుడూ సపోర్ట్‌గా మాట్లాడుతుందని ఆవిడంటే అభిమానం లోకేష్‌కి.

లోకేశ్వరరావు అని ఈ లోకంలో లేని తాతగారి పేరు పెట్టినందుకు మనవడు ఆమెకు ప్రీతిపాత్రుడయ్యాడు. ఫ్యాషన్‌గా ఉండాలని 'లోకేష్'గా మార్చుకున్నా ఆమె ఏమీ అనుకోదు.

"నేను చేసుకోబోయే అమ్మాయి పాత చింతకాయ పచ్చడిలా ఉంటే నాకు నచ్చదు. అందంగా ఉండాలి. స్టయిల్‌గా, మోడరన్‌గా ఉండాలి. ముద్దపప్పులాగా కాకుండా చక్కగా తెలివిగలదై ఉండాలి. ఇకపోతే మీరందరూ కలిసి 'వంట చేయటం వచ్చా?' 'పాటలు పాడతావా?' 'పచ్చళ్ళు పెట్టగలవా?' అంటూ బి.సి.నాటి ప్రశ్నలతో అమ్మాయిని తికమక పెట్టకూడదు. ఇలాంటి ప్రశ్నలు వేసేటట్లయితే మీరెవరూ రానక్కరలేదు. నేను ఒక్కడినే వెళ్ళి చూసి రాగలను. నా కండిషన్స్ అన్నిటికీ మీరు ఒప్పుకుంటే సరే. లేకపోతే నాకు పెళ్ళేవద్దు" అన్నాడు లోకేష్.

ఆమధ్య ఒకరింటికి పెళ్ళిచూపులకు వెళ్ళినప్పుడు 'అరటిపువ్వు కూర చేయటం వచ్చా?', 'ఆనపకాయ వడియాలు పెట్టగలవా?', 'పనసపొట్టు తీయగలవా?', 'పరమాన్నం వండటం తెలుసా?' అంటూ ప్రశ్నల బాణాలను సంధించి ఆ పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేసేసింది. బామ్మగారు కాదు వాళ్ళ అమ్మ అనసూయమ్మ.

"కాస్త పనీపాటా తెలిసి బుద్ధిగా ఇల్లు చక్కబెట్టుకునే పిల్లయితే బాగుంటుందిరా!" అంటూ ఇప్పుడు కూడా ఏదో చెప్పబోయింది, కానీ లోకేష్ ఎవరిమాటా వినే మూడ్‌లో లేడు.

"ఎలాగో వాడిష్టప్రకారమే ఏడవనివ్వండి! ఈరోజుల్లో ఆడపిల్లలెవరూ ముద్దపప్పుల్లా ఉండటం లేదు. ఏ అమ్మాయి అయినా వీడికా పేరు పెట్టకుండా ఉంటే చాలు" అన్నాడు జగన్నాథం.

"నీకు అంత కోపం దేనికిరా? వాడన్నదాంట్లో తప్పేముంది? ఈ కాలం పిల్లల తీరేవేరు" అంటూ మనవడి తరఫున మాట్లాడుతున్న తల్లిని చూసి

"నువ్వలా అన్నిటికీ వాడిని వెనకేసుకురాబట్టే వాడలా పెంకిఘటంలా తయారయ్యాడు. ఇప్పుడు చూడు పెళ్ళిచూపులకే ఎన్ని కండిషన్లు పెడుతున్నాడో! వీడికి పెళ్ళి చేయటం నా వల్ల అయ్యేలా లేదు"

"మరీ అంతగా బాధపడకురా! నీ కొడుక్కి ముక్కుతాడు వేసే పిల్ల ఎక్కడో పుట్టే ఉంటుందిలే!"

"ఏవిటో అమ్మా! అందరూ ఇద్దరేసి ముగ్గురేసి పిల్లల పెళ్ళిళ్ళు అవలీలగా చేసేస్తుంటే నేనేమో ఈ ఒక్కడు అదీ మగపిల్లవాడి పెళ్ళి చేయటానికి ఇంత ప్రయాసపడవలసి వస్తున్నది"

"అదేరా మరి! ఇలాంటప్పుడే మనం కాస్త తెలివిగా వ్యవహరించాలి. వాడు మనమాట వినకపోతే మనమే వాడి దారిలో నడుద్దాం"

"ఏమిటో! నీ మాటలు నాకర్థం కావటం లేదే!"

"నీకెందుకు! నువ్వలా చూస్తూ ఉండు. నేను నడిపిస్తాగా కథ!"

"ఏం కథ అత్తయ్యా?" అంది అనసూయ అమాయకంగా మొహంపెట్టి.

"అదా! పార్క్‌లో పెళ్ళిచూపులు అనే కథన్నమాట. తరువాయి భాగం వెండితెర మీద చూడాల్సిందే!" అంటూ అక్కడ్నించి నిష్క్రమించింది ఆవిడ.


అత్తగారు వెళ్ళినవైపు చూస్తూ "ఏమిటో ఈవిడ ఏదీ సరిగ్గా చెప్పరుకదా!" అని గొణుక్కుంది కోడలు.

అలా లోకేష్ చెప్పిన షరతుల ప్రకారం ఏర్పాటు చేసినదే ఈ పెళ్ళిచూపుల కార్యక్రమం.

ooo

పెళ్ళిచూపుల వేదిక ఇందిరాపార్క్. లోకేష్ ఒంటరిగా పార్క్‌లోకి అడుగుపెట్టాడు. కాసేపు అటు ఇటు





తిరిగి అక్కడున్న ఒక బెంచీపై కూర్చున్నాడు. అంతలో భజాల వరకు విరబోసుకున్న జుట్టు, కళ్ళకు గాగుల్స్, కాళ్ళకు హైహీల్స్, జీన్స్ పాంట్, స్లీవ్‌లెస్ టాప్‌తో మెడలో పొడుగ్గా వేలాడుతున్న పూసల గొలుసును వేలికి చుట్టుకుంటూ గబగబా నడుస్తూ వచ్చి లోకేష్‌కు ఎదురుగా నిలబడింది ఒక అమ్మాయి. ఫుల్‌పాష్‌గా ఉన్న ఆ వేషాన్ని చూసి కాస్త ఖంగుతిన్న లోకేష్ తేరుకోక ముందే తనే చొరవగా "హలో! అయామ్ లిఖిత" అంటూ షేక్‌హాండ్ కోసం చేయి చాపింది.

"బామ్మ చెప్పిన పేరు ఇదే కదా" అనుకుంటూ చేయి అందించకుండా "న...న...నమస్కారం!" అన్నాడు రెండు చేతులు జోడించి.

అతని తత్తరపాటు చూసి పెద్దగా నవ్వింది లిఖిత.

తరువాత లిఖిత పెళ్ళికొడుకు స్థానంలోను, లోకేష్ పెళ్ళికూతురు స్తానంలోను ఉన్నట్లు ఆ అమ్మాయే గడగడా ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ అతన్ని కొన్ని ప్రశ్నలు కూడా అడిగింది. ఇంజనీరింగ్ చదివినప్పటికీ ఆంగ్ల పరిజ్ఞానం అణువంతైనా లేని వాడిలాగా తడబడుతూ సమాధానాలు చెప్పాడు.

కొంతసేపయ్యాక "ఇఫ్ యు డోన్ట్ మైండ్!" అంటూ బాక్ పాకెట్‌లో నుండి సిగరెట్ పెట్టి తీసి తనొకటి తీసుకొని అతని వైపు చెయ్యి చాపింది ఆఫర్ చేస్తున్నట్లుగా.

బిత్తరపోయిన లోకేష్ "నో, నో" అంటూ మరికాస్త వెనక్కు జరిగాడు.

లిఖిత విరబోసుకున్న జుట్టు ముఖాన్ని సగం కప్పేస్తున్నట్లుగా ఉంది. దానికితోడు నల్లకళ్ళద్దాలు ధరించటం వల్ల ఆమె ఎటు చూస్తున్నదో ఆ కళ్ళు ఎలా ఉంటాయో ఏమీ తెలియటం లేదు. డార్క్ బ్రౌన్ కలర్ లిప్‌స్టిక్ వేసిన పెదవులు మాత్రం ఆమె ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. పెద్దగా నవ్వుతున్నందున ముందుకు వెనక్కు ఊగుతున్నప్పుడు జుట్టంతా ముఖం మీద పడుతోంది. లోకేష్‌కి ఎందుకో చాలా చిరాకుగా ఉంది. ఆపెళ్ళిచూపుల తతంగం ఎలాగో ముగిసేసరికి అతనికి ముచ్చెమటలు పోశాయి.

'అమ్మో! మోడరన్ అంటే మరీ ఇంతగానా! వద్దుబాబోయ్!' అనుకున్నాడు.

ఆ విషయమే చెప్పాడు ఇంటికి వచ్చాక.

"ఫ్యాషన్‌గా ఉండే అమ్మాయి కావాలని నువ్వే అన్నావుకదరా!" అన్నారు వాళ్ళ అమ్మ, నాన్న.

"అంటే మాత్రం మరీ ఇంతగానా! ఆ వేషం, ఆ దూకుడు నాకు నచ్చలేదు" అంటూ మరోమాటకు అవకాశం ఇవ్వలేదు వాళ్ళకు.

"అవునా లోకేశూ! అయితే మరీ టూమచ్ మోడరన్ను అన్నమాట. నచ్చకపోతే పోనీలే!" అంటూ ఎప్పటిలాగా మనవడికి వంత పాడింది బామ్మగారు.

అప్పుడప్పుడూ మనవడు పలికే ఇంగ్లీషు మాటలను వంటపట్టించుకుని వాటిని తన స్వంత బాణీలో పలకటం ఆమెకు అలవాటు.

"ఔరా!" అంటూ అలవాటు ప్రకారం ముక్కున వేలేసుకుంది వాళ్ళమ్మ అనసూయ.

"చూశావా అమ్మా! వాడి తలపొగరు. మోడ్రన్ అమ్మాయి కావాలన్నాడని నువ్వు కూడా వాడికి వంత పాడి హైటెక్కు లెవెల్లో పెళ్ళిచూపులు ఏర్పాటు చేశావుగా! ఇప్పుడు చూడు ఏమయిందో!" అంటూ ఎప్పటి


లాగే తల్లిమీద విరుచుకుపడ్డాడు జగన్నాథం.

"ఏమీ కాలేదు. నువ్వు ఊరికే రాద్ధాంతం చేయకు. ఇంత మాత్రానికే అంత గొడవ చేస్తా వెందుకు? వాడికి నచ్చిన పిల్లనే చేసుకోనిద్దాం! ఈసారి ఆదివారం మనం శిల్పారామం వెళు తున్నాం!"

"ఎందుకత్తయ్యా! ఆవకాయ పచ్చడికి జాడీలు కొనటానికా?" అన్నది అనసూయ అప్పటిదాకా ఆ తల్లీకొడుకుల మాటలు మౌనంగా వింటున్నదల్లా.

"అవునే కోడలా! నీకు నచ్చిన జాడీని తీసు కుందువుగాని"

"అలాగే అత్తయ్యా!" అంటూ తల ఊపింది అనసూయ.




000

చల్లని సాయంకాలం శిల్పారామం జనంతో సంద డిగా ఉంది. అటూ ఇటూ చూస్తూ మెల్లగా నడుస్తున్న లోకేష్ దగ్గరకు వచ్చింది ఒక అమ్మాయి.

"నమస్కారమండీ!" అంటూ రెండు చేతులూ జోడించింది.

"వికలాంగుల సహాయార్థం ఇక్కడ మేము ఒక స్టాల్ ఏర్పాటు చేశాము. అందులో మీరు ఏవయినా కొన్నట్లయితే మాకు సహకరించినట్లవుతుంది" అన్నది.

లోకేష్ ఆ అమ్మాయిని చూస్తూనే చిత్తరువులా నిల బడిపోయాడు. బాపు బొమ్మలా, నందూరివారి ఎంకిలా, వడ్డాది పాపయ్య చిత్రంలా ఇంకా ఎన్నో ఎన్నెన్నో అందాలతో చక్కదనాల చుక్కలా ఉన్న ఆ అమ్మాయిని చూసిన లోకేష్ నోట మాట రాక నిలబడి పోయాడు. నీలం రంగు పట్టు పరికిణీ అదేరంగు జాకె ట్‌పై తెల్లని వోణి, జడలో తురిమిన సన్నజాజులు, అంతకంటే స్వచ్ఛంగా ఉన్న చిరునవ్వుతో మంచి ముత్యాలు రాలినట్లుగా మాట్లాడుతుంటే మైమరచిపో యాడు.

అంతలో వెనగ్గా నడుస్తున్న అనసూయ, జగ న్నాథం, బామ్మ లోకేష్ దగ్గరగా వచ్చారు.



"ఏమ్మా! ఏమిటి సంగతి?" అంటూ పలకరించింది బామ్మ గారు. విషయం వివరించింది అమ్మాయి.

"అలాగే! మా అబ్బాయి ఇటువంటి వాటిల్లో ముందే ఉంటాడు" అంటూ భరోసా ఇచ్చింది మనవడి గురించి.

ఆ అమ్మాయి చూపించిన స్టాల్‌లో కొన్ని వస్తువులను కొని బిల్ పే చేశాడు లోకేష్.

రసీదు రాసి ఇస్తూ అతని వంక నవ్వుతూ చూసి "చాలా థ్యాంక్సండీ!" అన్నది లోకేష్ మనసునిండా ఆ అందమైన చిరునవ్వుల వెన్నెలలే నిండిపో యాయి.

000

పెరట్లో తులసికోట దగ్గర కూర్చుని ఆధ్యాత్మిక రామాయణ కీర్తలను మెల్లగా పాడుకుంటూ వత్తులు చేసుకుంటున్నది బామ్మ గారు.

"బామ్మా! ఇక్కడున్నావా" అంటూ వచ్చి ఆమె పక్కన చతికిలబ డ్డాడు లోకేష్.

"ఏం కావాలిరా నాన్నా! సున్నుండలు చేశాను పెట్టనా?"

"సున్నుండలు తరువాత తింటాను కాని సూటిగా నిన్నొకటి అడుగుతాను చెప్పు"

"వాటీజ్ దట్టూ?"

"నిన్న మనం శిల్పారామంలో చూసిన అమ్మాయి నీకు ముందే తెలుసా?"

"ఎవరూ? నిన్న మనతో మాట్లాడిన అమ్మాయా! నాకే కాదు. నీక్కూడా తెలిసినమ్మాయే!"

"నాకా! ఎక్కడో చూసినట్లనిపిస్తున్నది కాని గుర్తుకు రావటం లేదు బామ్మా! ఎవరో చెప్పవా?"

"చెబుతానురా. ఇంతకీ ఎందుకు ఆ అమ్మాయి గురించి అడుగుతున్నావూ?"

"ఎందుకంటే..ఎందుకంటే... ఆ అమ్మాయి చాలా బాగుంది. అందుకని" అంటూ నసిగాడు.

"ఆ! ఏం బాగుండటంలే! ఏదో పాత చింతకాయ పచ్చడి అనుకో"

"నువ్వలా ఎందుకు మాట్లాడుతున్నావో నాకు తెలుసుకాని అందంగా, అణకువగా, తెలివిగా ఉన్న ఆ అమ్మాయి నాకు బాగా నచ్చింది. ఇకనైనా ఆ అమ్మాయి ఎవరో చెప్పవా?"

"ఎందుకు చెప్పనురా! ఆ అమ్మాయి ఎవరనుకు న్నావు? నువ్వు పార్కులో చూసి నీకు నచ్చలేదు అన్న లిఖిత. అసలు పేరు లలితా పరమేశ్వరి."

"ఏమిటీ! లిఖితే లలితా పరమేశ్వరా!" అన్నాడు లోకేష్ నోరంతా తెరిచి ఆశ్చర్యపోతూ.

"కాదు, కాదు.లలితా పరమేశ్వరే లిఖిత.."

అప్పుడే అక్కడికి వచ్చారు అనసూయ, జగన్నాథం.

"ఏమిటేమిటి? ఆ అమ్మాయే ఈ అమ్మాయా!

## బాక్సింగ్ భామ

బాలీవుడ్ సెక్స్‌బాంబ్ మల్లికా షెరావత్ హాలీవుడ్‌లోనూ నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమధ్య జాకీచాన్‌తో 'మిత్' సినిమాలో నటించిన మల్లికకి అందులో నటించేటప్పుడు కొన్ని స్టంట్ సన్నివేశాల్లో స్టంట్‌లు చేయడం రాక కొంచెం ఇబ్బంది కలిగిందిట. అందుకనే భవిష్యత్తులో అలాంటి సమస్యల్లేకుండా ఇప్పుడు కిక్ బాక్సింగ్ నేర్చుకుంటోందిట మల్లిక. ట్రూ ప్రొఫెషనల్ అన్నమాట!

అయితే అప్పుడలా ఇప్పుడిలా...” అన్నాడు జగన్నాథం.

“అవున్రా! ఇదంతా నా ప్లాన్ ప్రకారమే జరిగింది. లలితా పరమేశ్వరి ఎవరనుకున్నారు? మా మేనమామ వేలు విడిచిన చెల్లెలు ఆడపడుచు అత్తగారి తోటికోడలు మనవరాలు” అని చెప్పి ఊపిరి తీసుకోవటానికన్నట్లుగా ఒక్క క్షణం ఆగి చెప్ప సాగింది.

“ఎంత దగ్గరి సంబంధమో!” అని గొణిగింది అనసూయ.

“అసలు లలితా పరమేశ్వరినే చూపిద్దామనుకుంటుండగా బాగా ఫ్యాషన్‌గా ఉండే అమ్మాయిని తప్ప చేసుకోనన్నాడు లోకేశ్. కానీ నా మనవడి ఇష్టాయిష్టాలేమిటో నాకు బాగా తెలుసు. వీడికి బజార్లో దొరికే బర్గర్లు, పిజ్జాల వంటి ఫాస్ట్‌ఫుడ్స్ కన్నా ఇంట్లో చేసిన జంతికలు, అరిసెలే నచ్చుతాయి. ఇంకా అవేమిటవీ! ఆ! కట్‌లెట్టులు, క్రీ పప్పుల కంటే నేను చేసిన కజ్జికాయలు, అరటి కాయ బజ్జీలనే ఇష్టపడతాడు.


అయినా ఇప్పటి సినిమాలు, టి.విలు చూసి ఏదో ఫ్యాషన్‌గా ఉండే అమ్మాయి కావాలన్నాడు కాని నిజానికి వీడికి అలాంటి పిల్ల నచ్చదని నాకు తెలుసు. ఏరా లోకేశూ! నేను కరక్టేనా!”

“సెంట్ పర్సెంట్ కరెక్టే బామ్మా!” అన్నాడు తల వంచుకుని లోకేశ్.

“అందుకే! లలితా పరమేశ్వరినే లిఖితగా నటించమన్నాను ఎలా అయినా. ఆ అమ్మాయినే నీకిచ్చి చేయాలని. ఆ అమ్మాయి ముందు ఒప్పుకోలేదు. నేనెంతో నచ్చజెప్పిన మీదట అంగీకరించింది. వాళ్ళ అమ్మా నాన్నలకు కూడా తెలియకుండా వాళ్ళ ఫ్రెండు సాయంతో నా సలహాను అనుసరించి నేను చెప్పిన దానికంటే కాస్త ఎక్కువగానే ఏక్షన్ చేసిందట. నువ్వు భలే కంగారు పడ్డావని చెప్పి నవ్వింది లే”

“అవును. అయితే ఆ సిగరెట్టు...అదీ...”

“అదా! అంటూ పకపకా నవ్వింది బామ్మగారు. సిగరెట్టు తీసిందిగాని వెలిగించలేదు. నోట్లో పెట్టుకోలేదుటగా”




“అవును. నిజమే” అన్నాడు గుర్తుచేసుకుంటూ.

“ఏమయితేనేం! నీకు లలిత నచ్చినందుకు ఆనందంగా ఉంది.”

“అంటే. శిల్పారామంలో జరిగినవి కూడా పెళ్ళి చూపులేనన్న మాట! అమ్మా! నీ తెలివి తేలు అమోఘం!” అన్నాడు జగన్నాథం.

“అయితే బామ్మా! లలితకు నేను నచ్చానో లేదో!” సందేహంగా అన్నాడు లోకేశ్.

“పిచ్చినాగన్నా! నీ ఫోటో ముందే చూపించాను అమ్మాయికి. నువ్వు నచ్చావు కాబట్టి నీకోసం పేరు మార్చుకుని, వేషం మార్చుకుని నేను చెప్పినట్లు చేసింది.

అయినా ఈ కాలం ఆడపిల్లలు రెండువైపులా పదునున్న కత్తిలాంటి విళ్ళు. మోదరన్నుగానూ ఉండగలరు, ముద్దబంతి పువ్వులాగానూ తయారుకాగలరు. ఎవరు ఎన్ని వేషాలు వేసినా, ఎన్ని భాషలు మాట్లాడినా మన వేషభాషలను చులకన చేయకూడదు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను మరువకూడదు. లలిత చాలా బుద్ధిమంతురాలు. తెలివైన అమ్మాయి. సేవా కార్యక్రమాలు అవీ చేస్తూ ఉంటుంది. నీకు తగిన జోడీ”

“థాంక్స్ బామ్మా” అన్నడు లోకేశ్ ఆనందంగా.

“నో థాంక్స్. నా మనవడి కోసం మంచి అమ్మాయిని చూడాలనే నా కోరిక నెరవేరింది. పెళ్ళిచూపులు వెరైటీగా ఉండాలనే నీ కోరికా తీరింది” అన్నది బామ్మ. కోడలి వైపు తిరిగి “ఏం కోడలా! శిల్పారామంలో చూసిన జోడీ నీకు నచ్చిందా?” అన్నది.

“చాలా బావుంది అత్తయ్యా!” అన్నది అనసూయ.

“ఫరవాలేదు నీక్కూడా కాస్త తెలివితేటలు వస్తున్నాయే” అన్నాడు జగన్నాథం భార్యతో.

“నేనిప్పుడు లోకేశ్‌కు తల్లిని మాత్రమే కాదు లిఖితకు కాబోయే అత్తగారిని కూడాను”

“లిఖిత కాదే అమ్మా! లలితా పరమేశ్వరి. ఇకనుండి నా పేరు లోకేశ్ కాదు లోకేశ్వరరావు” అంటున్న మనవడిని మురిపెంగా చూస్తూ “వెరీ వెరీగుడ్డూ!” అన్న బామ్మగారి మాటలకు అక్కడ నవ్వుల పువ్వులు విరిశాయి.

## హాలీవుడ్ బిపాషా!

మొన్నామధ్య లిస్బన్‌లో జరిగిన సెవెన్ వండర్ కార్యక్రమానికి హాలీవుడ్ నటుడు బెన్ కింగ్‌స్లేతో కలిసి యాంకరింగ్ చేసిన బాలీవుడ్ తార బిపాషా బసు అమాంతం హాలీవుడ్ దృష్టిలోకి వచ్చేసిందనడానికి తాజా నిదర్శనం ఆమెకి రెండు ఇంగ్లీషు చిత్రాల్లో చాన్సులు రావడమే. దీంతో ఆమె తనకి హాలీవుడ్ రంగానికి గాను అక్కడి వ్యక్తిని తన సెక్రటరీగా అపాయింట్ చేసుకుందిట బిపాషా. ఈ రెండు సినిమాలు గనక సక్సెస్ అయితే మరిన్ని హాలీవుడ్ సినిమాలు చేయడానికి కూడా బిపాషా రెడీయేనట.

